సిద్ధిఖీనగర్‌లో టెన్షన్..టెన్షన్

ఒక్కసారిగా ఒరిగిన భవనం.. పరుగులు తీసిన నివాసితులు



గచ్చిబౌలి: సిద్ధిఖీనగర్‌లో మంగళవారం ఉన్నట్టుండి భవనం ఒక వైపు ఒరగడంతో టెన్షన్ నెలకొంది. దాదాపు 40మందికి పైగానే ఈ భవనంలో నివాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. భవనం ఒరగడంతో అద్దెకు ఉంటున్న వలస జీవులు భయంతో బయటకు పరుగులు తీశారు. భవనం పక్కకు ఒరిగిందన్న సమాచారంతో ఆ ప్రాంతవాసులు వందల సంఖ్యలో తరలి వచ్చారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో బాధితులతో పాటు చుట్టు పక్కల వారంతా తెల్లవార్లు పడిగాపులు కాశారు. భవనం వైపు ఎవరు వెళ్లకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు, డీఆర్‌ఎఫ్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ భవనంతో పెను ప్రమాదం పొంచి ఉందని భావించిన జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేయాలని నిర్ణయించారు. భవనం చుట్టూ ఉన్న 20 భవనాలను ఖాళీ చేయించారు. అన్ని రోడ్లు ఇరుకుగా ఉండటంతో ఒక వైపు నుంచే జాగ్రత్తగా కూల్చివేత జరపాలని ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. బుధవారం ఉదయం 11.20 గంటలకు వెస్ట్ జోనల్ కమిషనర్ ఆర్.ఉపేందర్ రెడ్డి పర్యవేక్షణలో కూల్చివేతలు ప్రారంభించారు. కాగా ఘటనకు కారణమైన కాంట్రాక్టర్ కొండ శ్రీనివాస్‌పై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పిల్లర్ల కోసం తవ్విన గుంతల కారణంగా భవనం ఒరిగిందని శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ ఫిర్యాదు చేశారు.

పిల్లలతో రోడ్లపైనే ఉన్నాం

వంట చేస్తుండగా భవనం పక్కకు ఒరుగుతుండడంతో బయటకు పరిగెత్తుకుంటా వచ్చాం. 70 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు, ఏటీఎం కార్డులు, సిలిండర్లు, సామగ్రి, బట్టలు గదిలోనే ఉండిపోయాయని తెలిపారు. ఎక్కడ ఉండాలో అర్థం కావడం లేదు. డ్యూటీకి వెళ్లాలి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. మా వస్తువులు, నగదు తిరిగి ఇవ్వాలి.

– అంజనాదాస్ సర్దార్





ల్యాప్‌టాప్ ఇంట్లోనే ఉంది



టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నా. మా అన్న రాజుతో కలిసి అద్దెకు ఉంటున్నాం. మా ఊరు జనగాం జిల్లా గబ్బెట. భవనం ఒరిగినప్పుడు డ్యూటీలో ఉన్నా. ల్యాప్ టాప్‌తో పాటు బట్టలు, సామగ్రి అక్కడే ఉన్నాయి. –హరీష్

సర్టిఫికెట్లు పోయాయి



రెండేళ్ల క్రితం అస్సాం నుంచి వచ్చి సిద్ధిఖీనగర్‌లో ఉంటూ హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నా. రోజు మాదిరిగానే డ్యూటీ ముగించుకొని సాయంత్రం వచ్చా. రాత్రి 8.30 గంటల సమయంలో భవనం పక్కకు ఒరగడంతో బయటకు పరిగెత్తా. పదో తరగతి సర్టిఫికెట్స్‌తో మరి కొన్ని డాక్యుమెంట్లు ఇంట్లో ఉన్నాయి. బతికితే చాలు అనుకుని బయటకు వచ్చా. – గునేంద్ర దేవ్

పేక మేడల్లా భవనాలు



ఇరుకు రోడ్లు.. ఫైరింజన్‌కు దారిలేదు

శేరిలింగంపల్లి సర్కిల్‌లోని సిద్ధిఖీనగర్‌లో అంతర్గత రోడ్లు పది అడుగులకే పరిమితమయ్యాయి. దీనికితోడు స్లాబ్‌లు బయటకు రావడంతో ఆపత్కాలంలో ఫైరింజన్ వెళ్లడం చాలా కష్టంగా మారింది. పేక మేడల్లాంటి ఇళ్లకు ఇరుకైన రోడ్లు సవాల్‌గా మారాయి. ఈ రోడ్లలో ఫైరింజన్, అంబులెన్స్ కూడా వెళ్లలేకపోవడం గమనార్హం. మంగళవారం రాత్రి భవనం ఒరిగిపోవడంతో అక్కడికి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఐరిచ్ జంబో క్రషర్ మిషన్‌ను భవనం వద్దకు తీసుకొచ్చేందుకు అధికారులు, సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిఖీనగర్, అంజయ్యనగర్‌లలో 20 అడుగుల రోడ్లు .. కొన్నిచోట్ల పది 10 నుంచి 15 అడుగులకే పరిమితమయ్యాయి. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే కనీసం ఫైరింజన్ వెళ్లలేని పరిస్థితి ఉంది. జీహెచ్‌ఎంసీ అధికారులు 30 అడుగుల రోడ్డు ప్రాతిపదికన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. రోడ్డును అక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో అత్యవసర సమయాల్లో వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది.

సెట్‌బ్యాక్.. రోడ్లు లేవు

సిద్ధిఖీనగర్, అంజయ్యనగర్‌లో భవనాలు పేక మేడలను తలపిస్తున్నాయి. 50 చదరపు గజాల స్థలంలో ఐదంతస్తులు, వంద చదరపు గజాల స్థలంలో ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టడం రివాజుగా మారింది. అద్దెకు ఆశపడి కనీసం సెట్ బ్యాక్స్, రోడ్డు లేకుండా నిర్మాణాలు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా చేపట్టే నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంతైనా ఉంది.

చర్యలు తీసుకోవాలి



తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ అంతస్తులు నిర్మిస్తుంటే సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారని బీజేపీ నాయకుడు .రవి కుమార్ యాదవ్ ప్రశ్నించారు. బుధవారం ఆయన సిద్ధిఖీనగర్‌లో ఒరిగిన భవనాన్ని పరిశీలించారు. రెండు అంతస్తులకే నిర్మాణాలను పరిమితం చేయాలని అధికారులకు సూచించారు. హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

– రవి కుమార్‌యాదవ్

భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖీనగర్‌లో అకస్మాత్తుగా ఒరిగిన భవనాన్ని ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ హమీద్ పటేల్, జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్, పోలీసు అధికారులతో కలసి బుధవారం రాత్రి పరిశీలించారు. బాధితులు, స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెట్‌బ్యాక్ లేకుండా పక్కన సెల్లార్ తవ్వడం వలనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. భవనం చుట్టూ ఉండేవాళ్ళను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



సిద్ధిఖీనగర్‌లో భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

మహిళలతోనే 'ఇందిరా క్యాంటిన్ల' నిర్వహణ

సెర్ప్ డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపల్ డా. గణేష్, సెర్ప్ అధికారులు

రాయదుర్గం: ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లను మహిళలే నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్ఈఆర్‌పి) డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'నిథమ్' పర్యవేక్షణలో సెర్ప్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్ల నిర్వహణకు ఎంపికైన మహిళలకు వంటకాల తయారీ, కాంటీన్ల నిర్వహణ పది రోజుల శిక్షణా ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం నిథమ్ ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంకె గణేష్, చెఫ్‌లు తుల్జారామ్, మహేష్ మాట్లాడుతూ మహిళలు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. కృత్రిమ ఫుడ్‌కలర్ ఉపయోగించ రాదని, సహజరంగులు మాత్రమే వాడాలని కోరారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ డి.దివ్య ,పర్యాటకశాఖ, నిథమ్ డైరెక్టర్ హన్మంతు , అధికారి శ్రావణ్‌కుమార్, కోఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిషెల్లి జే ఫ్రాన్సిస్, నిథమ్ అధికారులు పాల్గొన్నారు.

వాహనాలు ఢీకొన్న ఘటనల్లో ఇద్దరు మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

మియాపూర్: వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వాహనం ఢీకొన్న ఘటనలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందగా, గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటనలు మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్ పేట్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఓ వ్యక్తి తల పగిలి కింద పడి ఉన్నాడని బుధవారం స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా వాహనం తలపై నుండి వెళ్లడంతో తల నుజ్జునుజ్జు కావడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాడు. చుట్టుప్రక్కల అతని గురించి ఆరా తీయగా ఎలాంటి సమాచారం తెలియలేదు. సుమారు ఈ వ్యక్తి (35–40) ఉంటుందని తెలిపారు. ఆకుపచ్చరంగు టీ షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం అతని తలపై నుండి వెళ్లడంతో తల పగిలి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే 9490617129, 8712568213 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతి చెందిన అన్నపూర్ణ

జాతీయ రహదారిపై వాహనం ఢీకొన్న ఘటనలో మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాంనగర్‌కు చెందిన కె.అన్నపూర్ణ(52) చందానగర్‌లోని అపర్ణ అపార్ట్‌మెంట్‌లో కేర్ టేకర్‌గా పనిచేస్తోంది. ప్రతినెలా రాంనగర్‌కు వస్తూ ఉండేది. ఈ నెల 13వ తేదీ అన్నపూర్ణ రాంనగర్‌కు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో మియాపూర్ మదీనాగూడ జాతీయ రహదారి పక్కన అర్చన ఆసుపత్రి ముందు ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అన్నపూర్ణ తలకు గాయాలు కాగా స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు కుటుంబ సభ్యుల సహాయంతో ఆసుపత్రికి తర లించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'ఏం సాధించారని విజయోత్సవ సభలు' ..?

అల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవ సభలు జరుపుతుందని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. వేములవాడలో కాంగ్రెస్ ప్రభుత్వం జరుపుతున్న విజయోత్సవ సభను ఉద్దేశించి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్న హస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని 152 మంది లబ్ధిదారులకు మంజూరైన 65 లక్షల రూపాయల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, రాజు, జనార్దన్, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శంభునికుంటను సుందరీకరించాలి



తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో ఉన్న శంభునికుంటను సుందరీకరించాలని సీపీఎం సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి బుధవారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెరువు నుంచి దుర్వాసన వస్తుందని, ముురుగుతో దోమలు, క్రిమికీటకాలు రావడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గణపతి ఉత్సవాల సందర్భంగా చెరువులో నిమజ్జనం చేసిన వ్యర్థ పదార్థాలను తొలగించకపోవడం మూలంగా కుంట పూడిపోతుందన్నారు. గుర్రపు డెక్క అల్లుకుపోయిందని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత, బీరంగూడ శాఖ కార్యదర్శి వీరాస్వామి, సునీత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమాన్‌నగర్, గోపాల్‌రెడ్డినగర్, 99 టీవీ ఆఫీస్, సైబర్‌వ్యాలీ, సైబర్ విలేజ్, సైప్రస్‌పామ్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్‌లో..

చందానగర్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- విశ్వంభర, శ్రీ లీలాఫీడర్ల పరిధిలో.. మధ్యాహ్నం 11.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఎస్ఎంఆర్, శ్రీలీలా విల్లాస్, విశ్వంభర, శిల్పా ఎవెన్యూ, మాతృశ్రీనగర్, మాధవనగర్, కళ్యాణ్‌గార్డెన్, దుర్గామాతా ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాతృశ్రీనగర్, సాయిరంగ థియేటర్, మాధవనగర్, అంబేద్కర్‌నగర్, నందినగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలోని.. సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు విద్యానగర్, సురక్ష కాలనీ, పద్మజ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి నగర్, అపర్ణ హెచ్‌టీ సర్వీస్ ఏరియాలలో విద్యుత్ ఉండదు

- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ కాలనీ రోడ్డు నెంబర్ 4,5,6, కైలాష్ నగర్ శ్రీదేవి థియేటర్ దగ్గర, ఎస్ఈఎస్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఇండియన్ ఫొటో ఫెస్టివల్ ప్రారంభం

- 46 ఎగ్జిబిషన్లు, 1500లకు పైగా చిత్రాలు
- ఉ 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో గురువారం ఇండియన్ ఫొటో ఫెస్టివల్ ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభించనున్నారు. జనవరి 5 వరకు నిర్వహించనున్న ఫెస్టివల్‌లో 46 ఎగ్జిబిషన్లు కొలువుదీరనున్నాయి. దాదాపు 1500లకు పైగా చిత్రాలను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేయనున్నారు. వివిధ దేశాలకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్‌లు పలు సెషన్‌ల ద్వారా సలహాలు ఇవ్వనున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

శేరిలింగంపల్లి: అభివృద్ధి పనుల కోసం తవ్విన కల్వర్టును అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. శేరిలింగంపల్లి సర్కిల్ ఖేల్ ఎంఐజీ కాలనీలో మంచినీటి పైప్‌లైన్లు వేసేందుకు ఏడాది కిత్రం రోడ్డును తవ్వారు. తవ్వి పైప్‌లైన్ వేసిన వాటర్ వర్క్స్ విభాగం అధికారులు కాలనీలోని ప్లాట్ నెంబర్ 2470 వద్ద ఉన్న వరద నీటి కాలువపై ఉన్న కల్వర్టును తవ్వారు. తిరిగి దానిని నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కల్వర్టు సమీపంలోకి వచ్చేదాకా సమస్య కనిపించకపోవడం, దీనికితోడు కల్వర్టు కార్నర్‌లో ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టు నిర్మించకపోవడంతో స్థానికులు బండ రాళ్ళను వేసి కొంత వరకు పూడ్చినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఖేల్ ఎంఐజీ కాలనీలో ప్రమాదకరంగా మారిన కల్వర్టు

సబ్‌స్టేషన్లకు స్థలాలు కేటాయించాలి

హెచ్‌ఎండీఏ కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే గాంధీ



హెచ్‌ఎండీఏ కమిషనర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ కోరారు. మంగళవారం హెచ్‌ఎండీఏ కమిషనర్‌తో సమావేశమైన గాంధీ మాట్లాడుతూ సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం మయూరీనగర్‌లో 1 ఎకరం, నల్లగండ్ల హుడా కాలనీలో ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. కాలనీల్లో భవనాల సంఖ్య రోజురోజుకు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరుగుతుందని , నల్లగండ్ల హుడా కాలనీ, మయూరీనగర్‌లో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలంటే సబ్ స్టేషన్ల నిర్మాణం తప్పనిసరైందన్నారు.అలాగే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలు, పార్కులను కాపాడాలని ఆయన కమిషనర్‌ను కోరారు. స్థలాల కేటాయింపుపై హెచ్‌ఎండీఏ కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: అయ్యప్పస్వామి నామ స్మరణతో గోపన్‌పల్లితండా మారుమోగింది. స్థానిక నాయకుడు శ్రీరామనాయక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజాలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షుడు శివసింగ్, సీనియర్ నాయకులు నర్సింగ్‌నాయక్, ప్రభాకర్, ప్రకాశ్, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ డిపోలో డయల్ యువర్ డీఎం



రాయదుర్గం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'డయల్ యువర్ డీఎం' నిర్వహిస్తున్నట్టు హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల సంఖ్య పెంచాలని పలువురు కోరారన్నారు. ముఖ్యంగా బస్సు నెంబర్ 222ఏ పటాన్‌చెరు వయా మాదాపూర్ నుంచి కోఠి వరకు ట్రిప్పుల సంఖ్య పెంచాలని రవిప్రసాద్ అశోక్‌నగర్ నుంచి కోరారని చెప్పారు. డిపోకు ఇటీవలే కొత్తగా 69 ఎలక్ట్రికల్ బస్సులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ డిపో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

గచ్చిబౌలి: ఈజీ మనీకి అలవాటు పడ్డ ఇద్దరు యువకులు బైక్‌పై ఏపీ నుంచి గంజాయి తీసుకొచ్చి కటకటాలపాలైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా తీపర్రు గ్రామానికి చెందిన లీల నాగపవన్(23), తణుకు పట్టణానికి చెందిన రవి కృష్ణలు బీటెక్ పూర్తి చేసి జాబ్ కోసం నగరానికి వచ్చారు. ఎల్లమ్మ బండలో నివాసం ఉంటూ ఉద్యోగం వెతుక్కుంటున్నారు. లీల నాగపవన్‌కు కాకినాడకు చెందిన సురేంద్ర బాబు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. డబ్బులు అవసరం ఉందని చెప్పడంతో గంజాయి సరఫరా చేస్తాను అమ్మితే లాభం వస్తుందని చెప్పడంతో ఇద్దరు యువకులు ఓకే చెప్పారు. కొద్ది రోజుల క్రితం సురేంద్ర బాబు వద్ద కిలో గంజాయి తీసుకొని కాకినాడ నుంచి నాగపవన్, రవి కృష్ణలు బైక్‌పై హైదరాబాద్‌కు వచ్చారు. గంజాయి విక్రయించడంలో సక్సెస్ కావడంతో రెండోసారి ఏకంగా ఐదున్నర కిలోల గంజాయిని పల్సర్ బైక్‌పై తెచ్చారు. బుధవారం గచ్చిబౌలిలోని ఆల్‌సబా హోటల్ వెనక రోడ్డులో యువకులు గంజాయితో ఉన్నారని సమాచారం రావడంతో రాయదుర్గం పోలీసులు అక్కడికి వెళ్లారు. బైక్‌ను స్వాధీనం చేసుకోగా ఓ బ్యాగ్‌లో గంజాయి దొరికింది. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎమ్మెల్యే గాంధీపై విమర్శలు తగదు

అల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీపై ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిరుమర్తి రాజు అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 సంవత్సరాలు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. అమ్ముడుపోయారని చౌకబారు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నిత్యం ప్రజల్లో ఉండే సీఎం రేవంత్ రెడ్డి, పీఏసీ చైర్మన్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.

24న గౌడ సంఘం వన భోజనాలు

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీ చిత్తారమ్మ గుడి ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి కౌండిన్య (గౌడ) సేవా సమితి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి గౌడ కుల సోదర, సోదరీమణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పటాన్‌చెరు సీఐగా వినాయక్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పటాన్‌చెరు నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన వినాయక్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఐజీ కార్యాలయం నుండి బదిలీపై పటాన్‌చెరు వచ్చి బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండి న్యాయం చేస్తానని తెలిపారు. గతంలో పటాన్‌చెరు సీఐగా పని చేసిన ప్రవీణ్ రెడ్డి బదిలీపై ఐజీ ఆఫీసుకు వెళ్లారు.